క్లుప్తంగా

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

గజ్వేల్‌రూరల్: పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్ వద్ద పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పద్మశాలీల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం చొరవ చూపినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బురదమయమైన రోడ్డుతో అవస్థలు



చిత్తడిగా మారిన రోడ్డు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి కాలేజి నుంచి మోడల్ స్కూల్‌కు వెళ్లే మట్టి రోడ్డు బురదమయంగా మారడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో భారీ వాహనాలు వెళ్లడంతో పాదచారులు కూడా నడవలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల ఓ వాహనదారుడు అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మరమ్మతులు చేయాలని స్వేరోస్ నాయకుడు ఉప్పలేటి బాబు డిమాండ్ చేశారు.

షిరిడీలో సిద్దిపేట కళాకారుల నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య కళాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రానికి చెందిన భవాని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని శ్రీషిరిడి సాయిబాబా శతాబ్ది మండపంలో కూచిపూడి కళాకారులు నృత్యప్రదర్శన ఇచ్చినట్లు నిర్వాహకురాలు డాక్టర్ భవాని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సునీల్ జాదే, కాశీ అన్నదాన ఆర్యవైశ్య సత్రం సభ్యులు చల్ల ప్రకాష్, భూమా నాగేశ్వరరావు, జిల్లా ప్రకాష్, అల్లాడి ఈశ్వర్, సైకిల్ స్వామీజీ ఆశ్రమం శ్రీమతి పావని, నవనాథ్, సిద్దిపేట శ్రీషిరిడి సాయిబాబా దేవస్థానం చైర్మన్ కొండ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మోతే కుమార్, గరిపల్లి వెంకటి, చిరంజీవి యాదవ్, మిద్దె ప్రసాద్, దిలీప్ తదితరులు ఉన్నారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల విద్యాధికారి శ్రీదేశిరెడ్డి

హుస్నాబాద్: మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని మండల విద్యాధికారి శ్రీదేశిరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం నుండి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మండల పరిధిలో 822 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, హుస్నాబాద్ జిల్లా బాలికల పరిషత్ ఉన్నత పాఠశాల, హుస్నాబాద్ ఆదర్శ పాఠశాల, హుస్నాబాద్ టీఎస్ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నలుగురు చీఫ్ సూపరింటెండెంట్‌లు, నలుగురు డిపార్ట్‌మెంట్ అధికారులు, 47 మంది ఇన్విజిలేటర్స్ విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అప్రమత్తతతోనే ‘పది’లం

నేటి నుంచి పది పరీక్షలు

- టెన్షన్ వద్దంటున్న నిపుణులు
- ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచన



చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): పదో తరగతి విద్యార్థులకు ఇది పరీక్షా కాలం. ప్రతీ విద్యార్థికి విలువైన సమయం. ప్రతీ క్షణం వారి భవిష్యత్‌ను నిర్ణయించే సమయం ఆసన్నమైంది. పరీక్ష రాయాలంటే ప్రతీ విద్యార్థి మదిలో తెలియని ఆందోళన, కాస్త భయం, కంగారు, ఆత్రుతతో పాటు ఒత్తిడికి గురవుతుంటారు. కానీ, ఎలాంటి భయం, కంగారు లేకుండా మనసుని ప్రశాంతంగా ఉంచుకుంటే చాలు పది వార్షిక పరీక్షల్లో విజయం సాధించొచ్చని అంటున్నారు నిపుణులు. ఆత్మస్థైర్యంతో ముందడుగేస్తే పది ఫలితాల్లో అద్భుతాలు సృష్టించవచ్చని చెబుతున్నారు. ఏడాదంతా చదివిన చదువును ఎలా రాయాలి అన్న కంగారును పక్కన పెట్టి దృఢ సంకల్పంతో ముందుకు సాగితే విజయం మీ వశం అవుతుందంటున్నారు. ఎప్పుడూ నిర్వహించే పరీక్షలాగానే ఫీలవ్వాలని, ఇచ్చిన ప్రశ్నా పత్రాన్ని టెన్షన్‌కు గురికాకుండా ఒకటికి రెండుసార్లు శ్రద్ధగా చదవాలని సూచిస్తున్నారు. ప్రశ్నలకు జవాబులు గుర్తుకు రావడం లేదని కంగారు పడకుండా అందమైన చేతి రాతతో అర్థవంతమైన భావాలతో జవాబులను కళ్లకు కట్టేలా రాస్తే టెన్త్‌లో అత్యుత్తమ జీపీఏను సాధించడం సులభమంటున్నారు. నిపుణులు ఇచ్చిన టిప్స్ చదవండి. ఆల్ ద బెస్ట్.



టెన్త్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యాధికారులు

ఒత్తిడిలేకుండా పరీక్షలు రాయండి



ప్రతి విద్యార్థి కంగారు, ఒత్తిడికి గురి కాకుండా మామూలు రోజుల్లో ఉన్న మాదిరిగానే ప్రశాంతంగా ఉండాలి. అదే పనిగా నిద్ర పోకుండా రాత్రి పూట ఎక్కువ సేపు చదవొద్దు. నిద్ర లేకపోతే జ్ఞాపక శక్తి తగ్గి పోతుందని గుర్తుంచుకోవాలి. ఇంటి పరిసరాల్లో వ్యక్తిగత విషయాలు, గొడవల ప్రభావం లేకుండా చూసుకోవాలి. పరీక్షల్లో మంచి ఫలితాన్ని రాబట్టడం కోసం మనసు లగ్నం చేయాలి. ప్రతీ విద్యార్థి పరీక్షలకు సకాలంలో హాజరయ్యేలా, పరీక్షలు సజావుగా రాసేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ప్రోత్సహించాలి. ఉదయం పరీక్షా కేంద్రాలకు ఖాళీ కడుపుతో వెళ్లకుండా అల్పాహారం తిని వెళ్లాలి. నూనెతో వేయించిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు అయోమయానికి గురి కాకుండా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అనారోగ్యానికి గురి కాకుండా ఉండాలి.

– డాక్టర్ అమీనా సుల్తానా, పీహెచ్‌సీ, మిరుదొడ్డి

ప్రతీ క్షణం ముఖ్యమే



పది పరీక్షల్లో ప్రతీ క్షణం కీలకం. ముఖ్యంగా పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. అక్కడి పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి. చిన్న చిన్న అడ్డంకులు ఎదురైనా పట్టించుకోవద్దు. ప్రశ్నా పత్రాలను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలి. ప్రశ్నలకు సమాధానాలు గుర్తుకు రాకపోయినా, తెలియక పోయినా కంగారు పడొద్దు. ప్రతీ నిమిషం కీలకమే. కనుక సమయాన్ని వృథా చేకుండా ప్రయత్నించాలి. బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలను అర్థవంతంగా రాయాలి. ప్రతీ జవాబు అందంగా, అర్థవంతంగా రాయాలి. పరీక్షా సమయాల్లో ఇతరులతో మాట్లాడటం, ఇతరుల పేపర్లలో చూసి రాయడం చేయరాదు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకూడదు. తక్కువ మార్కుల ప్రశ్నలకు ఎక్కువ సమయం కేటాయించడం గానీ, ఎక్కువ మార్కుల ప్రశ్నలకు తక్కువ సమయం కేటాయించడం వంటి పొరపాట్లు చేస్తే పది ఫలితాల్లో జీపీఏ తగ్గిపోయే ప్రమాదం ఉంది.

– జోగు ప్రభుదాసు, ఎంఈఓ, మిరుదొడ్డి

పల్లె వనం ఎండుతోంది



చంద్లాపూర్‌లోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు ఎండుతున్నాయి. నాలుగేళ్ల క్రితం పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కల నిర్వహణ సరిగా లేకపోవడంతో సరిగా పెరగడం లేదు. చిన్నకోడూరు మండలంలోని చంద్లాపూర్, అల్లీపూర్ తదితర గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పట్టించుకోవడం లేదు. పల్లె ప్రనకృతి వనాల్లో వేలాది మొక్కలు నాటినప్పటికీ నిర్వహణ లేక ఎండిపోతున్నాయి. ఈ వనాల్లో మామిడి, ఉసిరి, సీతాఫలం, దానిమ్మ, వేప తదితర మొక్కలు నాటారు. రెండేళ్ల పాటు మొక్కలను జాగ్రత్తగా సంరక్షించారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. బోరు మోటారు ఉన్నా మొక్కలకు నీళ్లు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు పర్యవేక్షణ లేకపోవడంతో వీటి లక్ష్యం నెరవేరడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చర్యలు చేపడతాం

పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసినప్పుడు గతంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ ఉండేది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ నిర్వహణలో ఉంది. పల్లె ప్రకృతి వనాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మొక్కలను సంరక్షిస్తాం. మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– జనార్ధన్, ఎంపీడీఓ

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయ (పాత) వార్షికోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉత్సవాలు జరగనున్నాయి. వార్షికోత్సవంలో భాగంగా నిత్యహోమం, అభిషేకం, ఎదురుకోలు, కల్యాణం, సాముహిక కుంకుమార్చన, లక్ష పుష్పార్చన, ఏకాంత సేవా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పట్టణ వ్యాపారులను ఆదుకోవాలి

హుస్నాబాద్: మెదక్–ఎల్కతుర్తి వరకు చేపట్టిన నేషనల్ హైవే నిర్మాణంలో హుస్నాబాద్ వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోతున్నారని, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైవే నిర్మాణంలో పట్టణానికి చెందిన వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతారని, అంతేకాకుండా మిషన్ భగీరథ పైపులు, టెలీఫోన్ కేబుల్, డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసం అవుతుందన్నారు. నీటి పైపులు ధ్వంసమైతే పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌కు బైపాస్ నిర్మించి, రోడ్డు వెడల్పు చేయకుండా 90 అడుగులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా నాయకుడు ఎలగందుల శంకర్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు, నియోజకవర్గ కోశాధికారి కలకోటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ గౌడ్

గుగ్గిల్లకుంటను కాపాడాలి

సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ గ్రామంలోని గుగ్గిల్లకుంట మత్తడికాలువను రియల్టర్ల నుంచి కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. ఆదివారం గుగ్గిల్లకుంట మత్తడి కాలువను కార్యకర్తలతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొంతమంది భూ వ్యాపారులు గుగ్గిలకుంట మత్తడి కాలువను పూడ్చి ప్లాట్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. డీటీపీసీ అధికారులు వెంచర్‌ను పరిశీలించకుండా అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మత్తడి కాలువను మట్టితో పూడ్చటంతో నీరు పొలాల్లోకి పారుతుందని, దీంతో రైతులు, వాహన దారులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి గుగ్గిల్లకుంట మత్తడి కాలువను పరిశీలించి వెంచర్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తేలు ఇస్తారి, సాయిలు, యాదగిరి, రవి, యాదయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



గుగ్గిల్లకుంట మత్తడి కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు

ములుగు(గజ్వేల్): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు పిలుపునిచ్చారు. ములుగు మండలం వంటిమామిడిలో పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. బీజేపీ ప్రభుత్వంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం మండల స్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు తల్లిదండ్రులు, పెద్దల సహాయ సహకారాలు అవసరమన్నారు. మండలంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉచిత వైద్యసేవలు అభినందనీయం

తొగుట(దుబ్బాక): గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సీఐ ప్రారంభించి రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగాల బారినపడిన పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామీణ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పేదలకు వరమన్నారు. ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీఐతో పాటు మరో పది మంది రక్తదానం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సంపత్ కుమార్, లక్ష్మీ దంపతులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు మహేష్ కుమార్, కమల్ కుమార్, వినయ్, అభిషేక్, అలేఖ్య, ప్రసన్న, రాజ్‌కుమార్, మమతరెడ్డి, రమ్యకృష్ణ, మాజీ సర్పంచ్‌లు పాల లక్ష్మణ్‌గౌడ్, నర్సింహులు యాదవ్, గ్రామ యువకులు రమేష్ గౌడ్, స్వామి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న తొగుట సీఐ లతీఫ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో సందడి చేశారు. పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



వెంకట్రావుపేటలో 1993 -98 బ్యాచ్‌ల విద్యార్థులు

వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1993 నుంచి 1998 వరకు చదువుకున్న ఆరుబ్యాచ్‌ల టెన్త్ విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత కలుసుకొని సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు రాంరెడ్డి, నర్సింహారెడ్డి, నాగరాజును సన్మానించారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

మర్కూక్(గజ్వేల్): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఇచ్చిన హామీలు మూడు నెలల్లో నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాశిరెడ్డిపల్లి, మర్కూక్ గ్రామాల పార్టీ అధ్యక్షులు వెంకటేష్, మల్లేశం ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాండ కనకయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి, గుండ శంకర్, జితేందర్‌రెడ్డి, పత్తి నర్సింహులు, సింగం ప్రభాకర్, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.